క్లుప్తంగా

జాబ్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి



పెద్దకడబూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ లోకేశ్వర్

పెద్దకడబూరు: ఉపాధి పనులకు వెళ్లేందుకు జాబ్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీడీ లోకేశ్వర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎవ్వరైనా ఇప్పటి వరకు జాబ్‌కార్డులు పొందనివారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కూలీలు నిర్దేశిత కొలతల మేరకు పని చేసి పనికితగ్గ వేతనం పొందాలన్నారు. ప్రతిరోజూ ప్రభుత్వం నిర్ణయించిన రూ.272 కూలి పడేవిధంగా కనీసం 4గంటలైనా పనులను చేసుకోవాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలు ఉదయాన్నే పనులకు వస్తే ఎండ పడేలోపు ఇంటికి వెళ్లవచ్చునన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీపై విచారణ



భూ సమస్యపై విచారణ చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి భూ సమస్యపై ఇటీవల స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీ విషయంపై బుధవారం సాయంత్రం మండల స్పెషల్ అధికారి, పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టారు. సమస్యపై ఇరు వర్గాల వారితో చర్చించారు. అర్జీదారుడు ఆదినారాయణరెడ్డిదే తప్పు ఉందని, దీనిపై ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక పంపుతామని మండల స్పెషల్ ఆఫీసర్ చెప్పారు. ఈయన వెంట తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఆర్ఐ జయరామి రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ మాలిక్ బాషా, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.

కంటి ఆపరేషన్లకు తరలింపు



కంటి ఆపరేషన్లకు తరలివెళుతున్న బాపురం గ్రామస్తులు

కౌతాళం: మండల పరిధిలోని బాపురం గ్రామంలో కర్నూలు అమీలియా ఆసుపత్రి ఆధ్వర్యంలో గత శుక్రవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ పరీక్షల్లో 50 మందికి ఆపరేషన్లు అవసరం కాగా వారిని బుధవారం అమీలియా ఆసుపత్రి బస్సులో తరలించారు. గ్రామ వైఎస్సార్సీపీ యువజన నాయకుడు గురునాథ్‌రెడ్డి, జైపాల్, కంటి డాక్టర్ ఈరన్న జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఆపరేషన్ల అనంతరం వారందరికీ ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నాయకులు పామిరెడ్డి, దేవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వీరేష్‌ఆచారి, అయ్యప్పరెడ్డి, రామలింగ, మూకప్ప, లక్ష్మిపతి, పెద్దబాబు, ఆశవర్కర్లు, గ్రామ వాలీంటర్లు పాల్గొన్నారు.

రీసర్వే పక్కాగా పూర్తి చేయండి



దేవబెట్టలో రీసర్వేను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: రీసర్వే పూర్తైన గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటును త్వరితగతిగా పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం దేవబెట్ట గ్రామంలో రీసర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా ఆదోని డివిజన్‌లో మొదటి విడతగా 54 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసుకొని ఇప్పటివరకు 26 గ్రామాల్లో హద్దులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 20 లోపు మిగతా గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. రీసర్వేలో ఎదురైన సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ జయన్న, ఆర్ఐ లక్ష్మణ్, సర్వేయర్ అశోక్, తదితరులు ఉన్నారు.

శ్రీమఠంలో దేవరాజ్ పూజలు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు సినీ నటుడు దేవరాజు బుధవారం మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు.

వేసవి సెలవులు.. మెండుగా ప్రయోజనాలు

- విద్యార్థుల జిజ్ఞాసను నెరవేరుస్తున్న సమ్మర్ క్యాంప్‌లు
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- ఆయా రంగాల్లో దూసుకుపోతున్న చిన్నారులు
- కళా భారత్ సేవా సమితి ద్వారా 20 ఏళ్లుగా శిక్షణ



కరాటేలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

ఆదోని అర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువు ఒక్కటే సరిపోదు. సృజనాత్మకత, నైపుణ్యం ఉండి లక్ష్యాలను చేధించినప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకుంటారు. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ పట్టుకోని పిల్లలంటూ లేరు. ఉదయం నిద్రలేచింది మొదలు పాఠశాలకు వెళ్లే వరకు ఫోన్‌తోనే గడిపేస్తున్నారు. తిరిగి స్కూలు నుంచి ఇంటికి రాగానే స్మార్ట్ ఫోన్‌లోనే ఆటలాడుతున్నారు. దీంతో శారీరక వ్యాయామానికి దూరమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేసవి సెలవుల్లో చిన్నారులకు క్రీడలపై ఆసక్తి పెంచేలా శిక్షణ ఇప్పిస్తే మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుంది.

వేసవి సెలవులు వచ్చాయంటే చిన్నారులకు పండగే. పుస్తకాలతో కుస్తీ పట్టిన వారికి ఒక్కసారిగా సంతోషం అనే రెక్కలు వచ్చి విహరించనున్నారు. పరీక్షలన్నీ ముగిశాయి. స్కూళ్లకు సెలవులు వచ్చేశాయి. ఆటపాటలతో గడిపేద్దామా అని ఎదురుచూస్తున్న విద్యార్థులకు సమయాన్ని వృథా కాకుండా ఉండేందుకు పట్టణంలోని కళాభారత్ సేవాసమితి వేసవి శిక్షణ శిబిరం నిర్వాహకుడు కేశవ్ మాస్టర్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఇందులో కరాటే, యోగా, ధ్యానం, వ్యక్తిత్వ వికాసం, బాక్సింగ్, సెల్ఫ్ డిఫెన్స్ (మహిళా రక్షణ), డ్యాన్స్, కర్రసాము ఉచితంగా నేర్పిస్తున్నారు. గత నెల 30వ తేదీ ఆదివారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు నెలరోజులపాటు రెండు చోట్ల రెండు సార్లు ఆయా అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో ఎంజీ కాలనీలోని వాటర్ ట్యాంకు శిబిరం నిర్వహిస్తున్నారు.

శిబిరంలో తర్ఫీదునిచ్చే అంశాలతో ప్రయోజనాలు

- **కరాటే:** ఈ కళను సాధన చేస్తే విశ్వాసం, సంతులనం, బలం, ధైర్యం వస్తుంది. ఎవరైనా హానీ కలిగించినప్పుడు స్వీయ రక్షణ కోసం, ఎవరినైనా రక్షించడానికి సహాయ పడుతుంది.
- **కర్రసాము:** ఆత్మరక్షణకు వినియోగించబడే ఒక పురాతనమైన కళ. పూర్వం గ్రామ సంరక్షణార్థం ఈ కళలో రక్షణ ఇచ్చేవారు. దారి దోపిడీలు, దొంగతనాలను నివారించడానికి, క్రూర మృగాల నుంచి తమను తాము కాపాడుకోవడానికి ఉపయోగం.
- **యోగా:** రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. నరాల లోపల ఏదైనా అడ్డుపడితే వాటిని తొలగిస్తుంది. వృద్ధాప్యంలో వచ్చే బోలు ఎముకల వ్యాధి, కీళ్ల నొప్పులకు దూరంగా ఉంచుతుంది. రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. రక్తం శరీరంలో అన్ని అవయవాలకు అందడంతో పాటు రక్తపోటు, ఒత్తిడిని తగ్గిస్తుంది.
- **ధ్యానం:** మానసిక ప్రశాంతత, పరిశుభ్రతకు ముఖ్యమైన పద్ధతి. ప్రశాంతతో కూడిన మనస్సు, మంచి ఏకాగ్రత, అవగాహన స్పష్టత, సమాధాన అభివృద్ధి, మానసిక నైపుణ్యం వృద్ధి చెందుతాయి.
- **డ్యాన్స్:** కాళ్ల నొప్పులు, కండరాళ్ల నొప్పులు వంటి సమస్యలతో బాధపడే వారికి మంచి వ్యాయామం. ఎముకలు బలంగా ఉంటాయి. డ్యాన్స్ వల్ల శరీరంలో ఎన్నో భాగాలు కదులుతాయి. మనల్ని ఫ్లెక్సిబుల్‌గా చేస్తుంది. దీనివల్ల బలంగా ఉండడంతో పాటు రోజువారి పనులు చకచకా చేసుకోగలరు.
- **వ్యక్తిత్వ వికాసం:** వ్యక్తి జీవితంలో మానసికంగా, శారీరకంగా కుంగిపోయినప్పుడు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాసం అవసరం పడుతుంది.
- **బాక్సింగ్:** శరీరం ఉల్లాసంగా ఉంటుంది. అలాగే ఆత్మరక్షణ కోసం ఉపయోగ పడుతుంది.



కర్రసాము నేర్చుకుంటున్న బాలలు

30 వేల మందికి శిక్షణ

గత 20 ఏళ్ల నుంచి ఉచితంగా కరాటే, యోగా, సెల్ఫ్ డిఫెన్స్, డ్యాన్స్, కర్రసాములో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 30 వేల మంది విద్యార్థులు శిక్షణ పొందారు. వారిలో వంద మంది వరకు ఆయా రంగాల్లో ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. ప్రస్తుతం రెండు బ్యాచుల్లో 250 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉంటాను



నేను ఐదో తరగతి చదువుతున్నాను. గత మూడేళ్ల నుంచి కళాభారత్ సేవా సమితిలో ఉచితంగా యోగా శిక్షణ పొందుతున్నాను. యోగాలో ఓపెన్ కాంపిటీషన్‌లో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచాను. ఎల్లప్పుడూ శారీరకంగా, మానసికంగా, ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటాను. యోగా వల్ల చదువుపై ఏకాగ్రత పెరిగింది. – హరిప్రియ, విద్యార్థిని, ఆదోని

ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరిగింది



నేను పదో తరగతి చదువుతున్నాను. గత ఆరు సంవత్సరాల నుంచి కరాటే నేర్చుకుంటున్నాను. గతేడాది ఓపెన్ కాంపిటీషన్ కరాటేలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించాను. కరాటే నేర్చుకోవడం వల్ల నాలో ఏకాగ్రత, ఆసక్తి, ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరిగింది. – విష్ణువర్ధన్, విద్యార్థి

20 ఏళ్ల నుంచి ఉచితంగా నేర్పిస్తున్నాం



20 ఏళ్ల నుంచి పిల్లలకు వేసవి సెలవుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటివరకు 30 వేల మందికి శిక్షణ ఇచ్చాం. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, నైపుణ్యం పెంచడం, ప్రతిభను వెలికితీయడం, శారీరక, మానసిక ఉల్లాసం కల్పించడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటివరకు 250 మంది శిక్షణలో చేరారు. ఈ వారంలో మరో 150 మంది వరకు శిక్షణలో చేరనున్నారు. చేరదలుచుకున్న వారు 85558 62475, 93980 14746 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. – కేశవ్ మాస్టర్, ఫిజికల్ ట్రైనర్, ఆదోని

సమస్యలకు పరిష్కారం చూపండి



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి నాగరాజ్‌నాయుడు

కౌతాళం: సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులందరూ బాధ్యతగా కృషి చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డీపీఓ నాగరాజు నాయుడు సూచించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ.. సచివాలయంలో వచ్చే స్పందన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలని, సమస్య తీవ్రంగా ఉంటే డివిజన్ స్థాయిలో గాని జిల్లా స్థాయిలో పరిష్కారానికి పంపాలన్నారు. అర్జీదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా పనులు వేగవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం సచివాలయాల్లో మరిన్ని సేవలు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అర్జీదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించడంతో పాటు బిల్లులను ఎప్పటికప్పుడు మంజూరు చేయాలని హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దారు రామేశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఏఓ శేషాద్రి, ఈఓపీఆర్‌డీ జనార్ధన్, కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తాం

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తోవి గ్రామంలో జగనన్న కాలనీలో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ గోపినాథ్‌వర్మ వెంట ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

గోనెగండ్ల: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని జేడీఏ, మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి సూచించారు. బుధవారం గోనెగండ్లలోని 1, 2 గ్రామ సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ఉద్యోగుల హాజరును పరిశీలించారు. సచివాలయంలో అందిస్తున్న సేవల గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఏయే సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయి తదితర వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల ద్వారా సేవలందించడంలో జిల్లాలో గోనెగండ్ల రెండవ స్థానంలో ఉందని చెప్పారు. సచివాలయ సేవలు విస్తృతం చేయాలని, స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ అధికారి రాజాకిషోర్, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న, సూపరింటెండెంట్ బాబు భాస్కర్ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



గోనెగండ్ల సచివాలయం-1లో రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ వరలక్ష్మి

టీటీడీ సహకారంతో ఆలయాల అభివృద్ధి



కోసిగిలో శంకర లింగేశ్వర ఆలయాన్ని సందర్శించిన శ్రీశైల దేవస్థానం డీఈ చంద్రశేఖర్ శాస్త్రి తదితరులు

కోసిగి: మంత్రాలయం నియోజకవర్గంలోని 31 ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వారి సౌజన్యంతో రూ.3.10 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే ఆదేశాలతో శ్రీశైలం దేవస్థానం డీఈ చంద్రశేఖర్ శాస్త్రి, ఏఈ రంగప్రసాద్ కోసిగి మండలంలోని 18 దేవాలయాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే, టీటీడీ దేవస్థానం వారితో చర్చించి ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కోసిగి మండలంలోని సాతనూరు, అగసనూరు, కందుకూరు, దుద్ది, వందగల్లు, కోసిగి, సజ్జలగుడ్డం, దేవర బెట్ట, జంపాపురం, ఐరన్‌గల్లు, పెద్ద భూంపల్లి, చిన్నభూంపల్లి, దొడ్డి, పల్లెపాడు గ్రామాల్లోని దేవాలయాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో ఆలయాల నిర్మాణం కోసం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ పెద్దలతో దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ఇది వరకే కోసిగి మండలంలో 18, కౌతాళంలో 8, మంత్రాలయం మండలంలో 5 దేవాలయాల నిర్మాణం చేపట్టేందుకు టీటీడీ నుంచి అనుమతులు వచ్చాయని వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

మద్యం తరలిస్తున్న మహిళల అరెస్ట్

ఆదోని రూరల్: ఆదోని పట్టణం బావాజీపేటకు చెందిన బోయ హనుమంతమ్మ, బోయ సారమ్మ కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొస్తుండగా మండలంలోని గజ్జహళ్లి క్రాస్ రోడ్డు వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఇస్వి హెడ్ కానిస్టేబుల్ బషీర్‌అహ్మద్ బుధవారం విలేకరులకు తెలిపారు. నిందితులు కర్ణాటకకు చెందిన బస్సులో మద్యం తీసుకొస్తూ పెద్దహరివాణం చెక్‌పోస్టు సమీపంలో పోలీసులను చూసి అక్కడే బస్సు దిగారన్నారు. మద్యంను మోసుకెళ్తుండగా ఇస్వి హెడ్‌కానిస్టేబుల్ రామయ్య, సిబ్బంది గమనించి గజ్జహళ్లి క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి 368 ఓసీ బ్రాండ్ టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్) స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

5న కోసిగయ్య స్వామి రథోత్సవం

కోసిగి: మండల ప్రజల ఆరాధ్య దైవం ఆంజనేయ (కోసిగయ్య) స్వామి మహా రథోత్సవం ఈనెల 5వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో గురువారం ఆంజనేయ స్వామికి విశేష పూజలు, ఆలయ ముఖద్వారం వద్ద ముత్యాల పందిరి వేసి వేదపండితుల ఆధ్వర్యంలో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంకాలం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయం నుంచి తేరుబజారు ఆవరణ వరకు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ప్రభోత్సవంపై కొలువుంచి ఊరేగింపు పాదాల చెంతవరకు లాగి తిరిగి యథా స్థానానికి చేరుస్తారు. మరలా 5వ తేదీన సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య మహారథోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఇంటి వద్దకే మెరుగైన వైద్యం

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యులు దీర్ఘకాలంగా రోగాలతో బాధపడుతున్న వారి ఇంటి వద్దకే వచ్చి చికిత్స అందిస్తున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి సూచించారు. బుధవారం హంప గ్రామంలో రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలందించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా రోగులకు ఇంటి వద్దే మెరుగైన వైద్యం లభిస్తుందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. బుధవారం ఆలూరులోని సచివాలయం-4 పరిధిలో వృద్ధులు, రోగులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మందులు అందించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్ ట్యాబ్లెట్లు ఇచ్చారు.

ప్రభుత్వ ఆశయాల మేరకు పని చేయాలి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఆదోని మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం

ఆదోని రూరల్: ప్రభుత్వ ఆశయాల మేరకు ప్రతి అధికారి పనిచేయాలని ఆదోని మండల స్పెషల్ ఆఫీసర్, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో ఆయా శాఖల మండలస్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. నాడు-నేడు పథకం కింద జరుగుతున్న పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఐసీడీఎస్ స్టాక్, పౌష్టికాహారం అందించే విషయంపై ఆరా తీశారు. స్టాకు వివరాలు, పిల్లల పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ పథకం లక్ష్యాలను గుర్తు చేసి ప్రతి కూలీకి కనీస వేతనం పడేలా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖలో పట్టాదారు పాసు పుస్తకాలు, సర్వే, ఆర్వోఆర్ అడంగళ్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, ఈఓపీఆర్‌డీ జనార్ధన్, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, ఎంఈఓ శివరాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, ఉపాధిహామీ ఏపీఓ చంద్రశేఖర్, వైఎస్సార్ వెలుగు క్రాంతి ఏపీఎం జనార్దన్, వ్యవసాయశాఖ మండలాధికారి పాపిరెడ్డి, మండల పరిషత్ ఏఓ రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



ఆంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న అర్చకులు

కౌతాళం: మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామంలో బుధవారం దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహంతో పాటు ఆలయం ముందు ధ్వజస్తంభంను, నవగ్రహాలను ప్రతిష్ఠించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే సుప్రభాతసేవ, సుదర్శన హోమం వంటి ప్రత్యేక పూజల అనంతరం హాల్వి మఠం పీఠాధిపతి మహంతస్వామి, హచ్చోళ్లి మఠం పీఠాధిపతి రుద్రముని స్వామి, రౌడూకుంద మఠం పీఠాధిపతి శివయోగి మహాస్వామి, అలూరు మఠం స్వామి మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అలాగే వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అంతకుముందు పీఠాధిపతులకు గ్రామ ముఖద్వారం నుంచి బ్యాండు మేళాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు.

ప్రశాంతంగా వేలం పాట



వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని బాపురం గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి, పోతురాజు స్వామి, మల్లేశ్వర స్వామి ఆలయాలకు చెందిన భూముల కౌలు హక్కులకు వేలం పాటను బుధవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించారు. దేవదాయ శాఖ ఆదోని గ్రూప్ టెంపుల్స్ ఈఓ రాంప్రసాద్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా సర్వే నంబరు 8లోని 4.53 ఎకరాల పొలాన్ని రూ.92 వేలకు కాళప్ప సొంతం చేసుకున్నాడు. అలాగే సర్వే నంబరు 85లో 7.59 ఎకరాలను రూ.90 వేలకు ఏశప్ప, సర్వే నంబరు 194లో 4.50 ఎకరాలను రూ.54 వేలకు హనుమయ్య, సర్వే నంబరు 15లో 3.80 ఎకరాలను రూ.91 వేలకు ఓంకార్‌రెడ్డి, సర్వే నంబరు 21లోని 2.33 ఎకరాలను రూ.40 వేలకు ఉమేష్‌స్వామి దక్కించుకున్నారు. సర్వే నంబరు 89లో 4 ఎకరాలకు సంబంధించి వేలం పాట వాయిదా వేశారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్స్ గ్రేడ్-2 ఈఓ రాధాకృష్ణ, గ్రామ పెద్దలు గురునాథ్ రెడ్డి, శివమోహన్‌రెడ్డి, జైపాల్, అయ్యప్పరెడ్డి, శ్రీనివాసరెడ్డి పలువురు పాల్గొన్నారు.

కనులపండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



సందేశం వినిపిస్తున్న పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో రంగస్వామి, లక్ష్మీదేవి ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం వేకువ జాము నుంచి వేద పండితులు మూర్తి స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, వెండి కవచ అలంకరణ, ఆకు పూజ, మహా మంగళ హారతులు గావించి విశేష పూజలు చేపట్టారు. వేదమంత్రోచ్చరణల మధ్య మేళతాళాలతో వందలాది మంది భక్తుల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు ముఖ్య అతిథిగా హాజరై ఆయన స్వహస్తాలతో ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు ఆయనకు గ్రామ ముఖద్వారం నుంచి కలశాలు, మేళతాళాలతో ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పీఠాధిపతి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరు దైవ మార్గంలో సుఖసంతోషాలతో జీవించాలని సూచించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

కేదార్‌నాథ్ యాత్రలో ఆదోనివాసులు సురక్షితం



కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లిన ఆదోనివాసులు

ఆదోని అర్బన్: కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లిన ఆదోని పట్టణానికి చెందిన 19 మంది సురక్షితంగా ఉన్నారు. బుధవారం కేదార్‌నాథ్‌లో మంచు తుఫాను కురవడంతో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన 150 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. గత నెల 23వ తేదీన పట్టణంలోని ఆయా వీధికి చెందిన ఈరన్నరావు, పంపాపతి, శ్రీనివాసులు, రాజుతో పాటు 15 మంది పురుషులు, మహిళలు గంగోత్రి, యమునోత్రి యాత్రను చూసుకుని కేదార్‌నాథ్‌కు బయలుదేరారు. అయితే వాతావరణం సహకరించకపోవడంతో అక్కడున్న సిబ్బంది వారిని కేదార్‌నాథ్‌కు వెళ్లకుండా నిలిపివేశారు. వారంతా సురక్షితంగా రుద్రప్రయాగ్‌లో ఉన్నారు. దీంతో బుధవారం మంచు తుఫాన్‌లో ఇరుక్కుపోకుండా బయటపడ్డారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

పెద్దకడబూరు: జగనన్న కాలనీలలో ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో ఇంటి పట్టాలను రద్దు చేస్తామని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వీరేంద్రగౌడ్ హెచ్చరించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో జగనన్న కాలనీని వారు సందర్శించి గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో హౌసింగ్ ఏఈ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో హౌసింగ్, నాడు – నేడు పనులపై సమీక్షించారు. వారు మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌లో ఇప్పటి వరకు గ్రౌడింగ్ చేయలేకపోతే ఇదొక్క వారం చూసి పట్టాలను రద్దు చేస్తామని ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. హౌసింగ్ సిబ్బంది నాగన్న తదితరులు ఉన్నారు.